# ఆదర్శంగా జీవించండి

నీతి నియమము లేక తిరిగిన ధాతకైనను జ్ఞాన మొదవదు
జ్యోతి లేనిది అంధకారము భూతలంబున రాజ్యమేలును
కన్ను విప్పి చూడరోరన్నా ఈ దేవదేవుడు
ఎన్నగా ఎందైనా కలడన్నా

**విద్యార్థులారా!**

కంటికి కనుపించనిగానము ఒక్కటే అయినప్పటికి రాగములు అనేకములు. ఒక్కొక్క రాగమునకు ఒక్కొక్క ప్రత్యేకమైన భావముకూడను ఉన్నది. అటులనే రసము కూడ ఒక్కటే అయినప్పటికిని ఈ రసమునకు అనేక కళలుంటున్నవి. వీనినే సంగీత శాస్త్రమందు చతుష్షష్టి అన్నారు. అరువది నాలుగు కళలతో కూడినది ఈ శాస్త్రము. గొప్ప పేరుగాంచిన గాయకుడైనప్పటికిని సాక్షాత్తు తుంబుర నారదులైనప్పటికిని ఒకే రాగమును విడువక పాడుచుండిన శ్రోతకు విసుగుగా ఉంటుంది. కనుకనే రసస్వరూపుడైన భగవంతుడు అనేక రూపములు ధరిస్తుంటాడు. ఉపనిషత్తు కూడను 'రసోవైసః.' భగవంతుడు రసస్వరూపుడన్నది. రసములయందు అనేకవిధములైన మార్పులు చేస్తుంటాడు. త్రిగుణాత్మకమైన ప్రకృతి ఒక్కటే. కాని ఈ ప్రకృతియందే అనేక విధములైన రంగులు, రుచులు, పరిమళములు శబ్దములున్నవి. ఇవన్నీ ఒక ప్రకృతి నుండియే ఆవిర్భవించినట్టి రసస్వరూపములు. రసస్వరూపుడైన భగవంతుని ఏవిధముగా వర్ణించటానికి సాధ్యమౌతుంది? అందుకే శ్రుతులు 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అన్నాయి. అనగా ఇతనిని వర్ణించుటకు వాక్కు చాలదు. మనసు లేదు. మనసు చేతను, వాక్కు చేతను అతనిని వర్ణించుటకు సాధ్యము కాదని శ్రుతి హెచ్చరించింది. అట్టి దివ్యత్వాన్ని మనము పొందవలెనన్న నామమే దీనికి నావ. అయితే ఈ నామములు ఉచ్చరించిన మహనీయులెందరో ఉంటున్నారు. ఎన్ని దినములు ఉచ్చరించినప్పటికి, ఎంతకాలము ఈ నామము స్మరించినప్పటికి ఎట్టి మార్పులు లేని వ్యక్తులు కూడను అనేకమంది ఉంటున్నారు.

రావణుడు, భస్మాసురుడు, కంసుడు ఇత్యాదివ్యక్తులు నిరంతరము భగవన్నామము

srisathyasaivachanamrutam

స్మరిస్తూ ఉండినప్పటికిని వారి అసురత్వము ఏమాత్రము తగ్గలేదు. దీనికి మూలకారణమేమిటి? వారి మనో యంత్రములు నిరంతరము అహం దేహోస్మి అహం దేహోస్మి అనే భావముతో కూడినవి. వీరు ఎంతో కాలము తపస్సులు చేశారు. ఈ తపస్సు యొక్క మంత్రము కూడను అహం దేహోస్మి అహం దేహోస్మి నేను దేహమును అనే భావము చేతనే ఈ నామస్మరణ తపస్సులు ఆచరిస్తూ వచ్చారు. ఎంతకాలము నామస్మరణ చేసినప్పటికిని దేహాత్మ బుద్ధిని మనము ఉంచుకున్నప్పుడు ఇది ఏమాత్రము మార్పు చెందదు. అనేకమంది వారివారి సంస్కారములను, సంప్రదాయములను పురస్కరించుకొని అనేక విధములైన రీతిగా సాధనలు సలుపుతుంటారు. ఎంతకాలము సాధన చేసినప్పటికిని వారిలో కొంతైనా మార్పులు కనిపించవు. దీనికి తగిన ఫలము నందుకోలేకపోతున్నామే అనే నిరాశ నిస్పృహల చేత వారు అనేక నామములు మార్చుకుంటుంటారు. నామములు మార్చుకోటమే కాకుండా మతములు కూడను మార్చుకుంటారు. మతమును మార్చుకున్నంత మాత్రమున భగవదనుగ్రహము ప్రాప్తించదు. మతిని మార్చుకోవాలి. గుడ్డలు మార్చుకున్నంత మాత్రమున భగవంతుని గుణములు మనలో అలవడవు. గుణమును మార్చుకోవాలి. మనస్సు మార్చుకున్న వ్యక్తికి మాత్రమే మనుష్యత్వము ప్రాప్తిస్తుంది.

ఒక చిన్న ఉదాహరణము. డ్రామాలోపల ఒక వ్యక్తి మొదటి సీనులో ఒక భిక్షకుడుగా వేషము వేసుకొని వస్తాడు. కాని రెండవ సీనులో అదే వ్యక్తి రాజఠీవిలో కనిపిస్తాడు. మరొక సీనులోపల ఇదేవ్యక్తి ఒక మంత్రిగా కనిపిస్తాడు. ప్రేక్షకులందరు ఆ భిక్షగాడు వేరు, ఈ రాజు వేరు, ఈ మంత్రి వేరు అనేరీతిగా భావిస్తారు. కారణం? వీరు ధరించిన వేషములే దీనికి కారణము. ప్రేక్షకులు ఇతని వేషమును, ఇతని action మాత్రమే గుర్తించటానికి పూనుకుంటారు. ఇంటియందు యజమానిని కుక్క గుర్తించుతుంటాది. మాస్టరు evening dress వేసుకున్నా, night dress వేసుకున్నా, office dress వేసుకున్నా, ఎన్ని డ్రస్సులు మార్చినప్పటికిని అతని శబ్దమును మాత్రమే కుక్క గ్రహిస్తుంది. కానీ వేషమును ఏమాత్రము గుర్తించదు. ఈనాడు మానవునికంటే కుక్కనే చాలా ఉత్తమమైన స్థితిని అందుకున్నట్లుగా కనిపిస్తుంది. కారణము అది శబ్ద బ్రహ్మమును మాత్రమే గుర్తిస్తుంది. కానీ

ఈనాటి మానవుడు రూపనామములు మాత్రమే గుర్తించటానికి ప్రయత్నిస్తాడు. రూపనామములు కల్పితములు. కాని శబ్దము శాశ్వతము. ఇట్టి శాశ్వతమైన శబ్దమును ఆధారము చేసుకున్నవారు నామమును చిన్మయరూపంగా దర్శనం చేసుకుంటాడు. కాని ప్రకృతిని ఆధారము చేసుకున్న మానవులు కేవలం మృణ్మయరూపంగా దర్శిస్తారు. మనస్సు పరిశుద్ధమైన మానవుడే చిన్మయ రూపుడు. మనస్సు అశుద్ధమైన మానవుడే మృణ్మయ రూపుడు. కనుక ఈ చిన్మయమునకు మృణ్మయమునకు ఉండిన వ్యత్యాసాన్ని మనం గుర్తించాలి. మానవత్వము లోపల ఇట్టి దివ్యత్వము లేకపోలేదు. ఈ దివ్యత్వము నుండి కూడను తనయొక్క ప్రాకృతమైన విషయ వాసనలచేత తాను ఈ జగత్తునకు కట్టుబడిపోతున్నాడు.

**భగవంతుడు ప్రేమ స్వరూపుడు**

భగవంతుడు ప్రేమస్వరూపుడని తెలుసు. భగవంతుడు ప్రేమ అనే రజ్జు ద్వారా బంధింపబడవచ్చు. అయితే ఈ ప్రేమను ప్రేమనిమిత్తమై మనము ఆశించినప్పుడే ఇతను బద్ధుడౌతాడు. పనికిమాలిన పదార్థముల నిమిత్తమై మనము ప్రార్థించటము చేత అతను మనకు బద్ధుడు కాడు. ప్రేమ నిమిత్తమై మనము ప్రాకులాడాలి. కనుకనే మనము ప్రేమస్వరూపులుగా మారాలి. ప్రేమికుడుగా నీవు ఉండకూడదు. ప్రేమికుడుగా ఉండినప్పుడు ఒక్కరిని మాత్రమే నీవు ప్రేమిస్తావు. నీవే ప్రేమగా మారినప్పుడు జగత్తునే ప్రేమించవచ్చు. సమస్త జీవులయందు ఉండిన దివ్యత్వము ఒక్కటే అని గుర్తు తెచ్చుకోవాలి. ఒకానొక సమయము లోపల కృష్ణుడు బాల్యావస్థ యందున్నప్పుడు పరుగెత్తి ఇంటిలో ప్రవేశించాడు. అమ్మ చీర పట్టుకున్నాడు. 'అమ్మా! ఈనాడు నేను గోపాలురతో గోవులవెంట అడవికి వెళతా'నన్నాడు. అప్పుడు యశోద చెప్పింది. 'నాయనా! అడవంటే నీవు సామాన్యంగా భావిస్తున్నావు అనేక ముండ్లు, రాళ్లు, రప్పలు, పురుగులు, తేళ్లు, పాములు అని విష పురుగులతో కూడి ఉంటుందాది. ఈనాడు నీకు చెప్పులు కుట్టించి రేపటి దినము నిన్ను గోవులతో పంపుతానన్నది. ఈనాటివలె చెప్పులు ఎక్కడంటే అక్కడ షాపుల్లో చిక్కే కాలం కాదు. ఒక వ్యక్తిని పిలిపించి తన సైజును చూపించి కుట్టించటానికి ప్రయత్నించే కాలమది. యశోద ఈ మాటలు చెప్పిన తక్షణమే కృష్ణుడు 'అమ్మా! మన గోవులు చెప్పులు వేసుకొని అడవులకు పోవటం లేదే?' అన్నాడు.

srisathyasaivachanamrutam

'నాయనా! అవి పశువులు. నీవు మానవుడు' అన్నది యశోద. అప్పుడు చెప్పాడు అమ్మా! అవి పశువులుగా నీవు భావించవద్దు. తమ రక్తాన్ని పాలుగా మార్చి తమబిడ్డల గొంతులు కూడ కట్టుకొని ప్రజలకు తమ క్షీరము నందిస్తున్నాయి. పనికి మాలిన గడ్డిని తిని పాలిస్తున్నాయి మనకు. చచ్చికూడను తమ చర్మముగా చెప్పులుగా కుట్టించుకోటానికి ఉపయోగపడుతున్నాయి. దానికుండిన అభిమానము, కృతజ్ఞత మనుష్యులకున్నదా? నేను ఒక దినము గోవులను చూడకపోయిన అవి కనుల నీరు కారుస్తూ ఉంటాయి. నేనెన్నో పర్యాయములు చూశాను. నా శబ్దము విని తక్షణమే తోకలు ఎత్తుకొని ఆనందముగా నా వైపుకు చూస్తుంటాయి. పెద్ద గోవులు మాత్రమే కాదు. చిన్నదూడలు కూడను పాలుత్రాగుతున్న సమయములో నా శబ్దము విన్నంత మాత్రమున పాలనుకూడ వదలిపెట్టిన నావైపున చూస్తుంటాయి. గోవులకు గోవత్సములకు ఉండిన ప్రేమ నాపైన నీకు కూడ లేదమ్మా అన్నాడు. నాయకుడుగా ఉండినవాడు గోపాలుడు. గోవులకు నాయకుడైనవాడు. మనము క్లాసు లీడరు కావచ్చును. రూము లీడరు కావచ్చును. పార్టీలీడరు కావచ్చును. సంఘలీడరు కావచ్చును. ఈ లీడరనేవాడు ఈ విధమైన ఆదర్శమును నిరూపిస్తూ పోవాలని ఆనాడు కృష్ణుడు ఈ భావములచేత యశోద మనసును మార్పు చేశాడు. ప్రతి వ్యక్తి ఆదర్శప్రాయముగా నిరూపించాలి. ఆ విధమైన మార్గమును మనము అనుసరించినప్పుడే జగత్తునకు ఉపకారము చేసినవారమౌతాము. మనకు మనము కూడను ఆనందాన్ని అందుకున్న వారమౌతాము.

మానవత్వము వృథానిమిత్తమై రాలేదు. ఇది చాలా విలువైనదనే విషయాన్ని మనము గుర్తించాలి. కాలమును వ్యర్థము గావించే కాయము కామము కాదని గుర్తించాలి. పవిత్రమైన ఈ దేహము ధరించి జంతూనాం నరజన్మ దుర్లభం పవిత్రమైన జన్మమునెత్తి మనము మానవులముగా జీవించ లేకపోయినప్పుడు ఇంక ఈ మానవత్వమనేదాన్ని మనం ఏరీతిగా గుర్తించటానికి వీలౌతుంది. ఏ రీతిగా దీనిని మనము అభివృద్ధి గావించాలి. కృషీవలుడు వుంటాడు. అతను ఒక క్షేత్రమునందు పంటను పండించాలనుకుంటే దానికిముందు చేయవలసిన కార్యములెన్నియో ఉంటుంటాయి. భూమికి చక్కగా నీరు కట్టి దానిని దున్ని దుక్కివేసి ఎరువువేసి సాగుచేసి మెత్తబరచి దానియందు నాటవలసిన మొక్కలో లేక వేయవలసిన విత్తనములో వేస్తాడు. అవి తిరిగి మొక్కలుగా వచ్చిన తరువాత కలుపుతీసి కాపలా కాసి దీనిని

రక్షించటం చేతనే పంటను ఇంటికి ఎత్తుకొని వస్తాడు. ఇదే ఈనాడు మనము చేయవలసిన హృదయ కృషి. హృదయము ఒక క్షేత్రము. ఈ క్షేత్రమును మనము సరియైన రీతిలో సాగుచెయ్యాలి. ప్రేమ అనే జలముతో దీనిని నింపుకోవాలి. విచారణ అనే నాగలితో దీనిని దున్నిపెట్టాలి. భగవంతుని నామము అనే విత్తము ఇందులో నాటాలి. జాగ్రత అనే కంచెను కట్టాలి. నిరహంకారము అనేదానితో దీన్ని కాపాడుకుంటూ రావాలి. అప్పుడే ఈ ప్రేమ ఫలమనే దానిని మనము అందుకోగలుగుతున్నాము.

**ప్రేమరసమును గ్రోలండి**

విద్యార్థులారా! ప్రతి మానవ జీవితమనే వృక్షమునందు కూడను ప్రేమ అనే ఫలము ఉంటున్నాది. ఈ ప్రేమను మనము అనుభవించాలంటే దీనికిపైన కప్పుకున్న ఒక చర్మము ఉంటున్నది. ఆ చర్మము మనము తీసినప్పుడే అందులో మధురమైన రసము మనకు చేజిక్కుతుంది. ఒక బత్తాయి ఫలము ఉంటున్నది. లేక కమలాఫలము ఉంటున్నది. దీనిపైన ఉండిన చర్మమును మనము తీసివేయాలి. తదుపరి ఇందులో ఉండిన విత్తనములను ఎత్తివేయాలి. దానిలో పనికిరాని గుజ్జు ఉంటుంటాది. దానిని కూడా వెలుపల నెట్టాలి. రసమును మాత్రమే మనము స్వీకరించాలి. ఇదే రసోవైసః. ఈ రసమును అందుకునే నిమిత్తమై జీవితమనే ఫలమును మనకందించాడు భగవంతుడనే గుర్తు మనం తెచ్చుకోవాలి. ఆడంబరము, అహంకారమనే చర్మమును మొట్టమొదట తీసివెయ్యాలి. మమకారమనే పీచును కూడ పారవెయ్యాలి. అప్పుడే ప్రేమ అనే రసము మనకు చిక్కుతుంది. కనుక ఈనాడు మనము చేయవలసిన సాధన ఇదియే. ప్రతివ్యక్తి ఒక కృషీవలుడే. ప్రతి హృదయము ఒక విధమైన క్షేత్రమే. ఈ క్షేత్రమును మనము వృథా చేయకూడదు. భూమినుంచుకొని సాగుచేయకుండా పోయినప్పుడు ఈ భూమి ఉండి ప్రయోజనము ఏమిటి? ఇది పవిత్రమైన క్షేత్రమే. కాని మనము సరియైన సాగు చేయకుండా పోవటం చేతనే బీడు భూమిగా తయారైపోతున్నది. ఈ బీడు భూమిలో ఏమి వేసినా ప్రయోజనము ఉండదు. ఎంతో విశాలమైన భూమి ఇది. ఇది ఎన్ని ఎకరములని కూడను ఎవరికి చెప్పుటకు సాధ్యము కాదు. ఎన్ని ఎకరములుండిన ఏమి ప్రయోజనము. మనకు కావలసిన పంటను మనము పండించుకోలేక పోతున్నాము.

srisathyasaivachanamrutam

**ఎంత చదువు చదివి యేరీతి ఉన్నను**
**హీను డవగుణంబు మానలేడు.**

మన క్షేత్రాన్ని మనము సరిదిద్దుకునే స్థితిలో లేకపోతున్నాము.

**పంట పండని భూమి పది ఎకరము లేల**
**కొంచెమైన చాలు మంచి భూమి.**

శుద్ధమైన, నిర్మలమైన, నిత్యమైన, నిస్వార్థమైన ప్రేమతత్త్వము కించిత్తు ఉండినా చాలు. ఈ ఆనందమును అందుకున్న కృతజ్ఞత యేకించిత్తైనా మనయందున్న చాలు. ఆ కృతజ్ఞతగాని ఆ విధమైన ప్రేమగాని లేని హృదయములు మరు భూములే. కనుక మనము ఈనాడు చేసుకోవలసిన ప్రయత్నమేమిటి? మనకుండిన విశాలమైన విలువైన ఈ భూమిని సాగుచేసుకోవటానికి తగిన కృషి చేయాలి. సాగు చేసుకునే శక్తి సామర్థ్యములు నీలో లేకపోలేదు. పిల్లలంతా ప్రతి speechలో చెప్తుంటారు. స్వామీ! దీనిని అనుభవించే శక్తిని నాకందించండి. స్వామియొక్క ఆజ్ఞను శిరసావహించి నడుచుకునే శక్తి సామర్థ్యములు నాకందించండి అని. వారు నిజంగా తమయందు శక్తి లేదనే అర్థం చేసుకుంటున్నారు. ఇది అందించేది కాదు. ఉన్నదే. ఉన్న దానిని మనము సరియైన రీతిలో మనము చూడలేక పోతున్నాము. కారణమేమిటి? నీ దృష్టి దానిపైన లేదు. నీ దృష్టియే దానిపైన ఉండిన దానిని యే రకంగానైనా సద్వినియోగము చేసుకొనటానికి ప్రయత్నిస్తావు. మానవత్వము లోపల ఒక వ్యక్తిత్వాన్ని గాని ఒక వస్తువును గాని చక్కగా గుర్తించినప్పుడే దీనికి సరియైన అర్థముంటుంటాది. దేనిని మనము ఆశిస్తున్నామో మొట్టమొదట దానిని గురించి మనము చక్కగా విచారణ చేయాలి. తదుపరి దానిని అనుభవించటానికి పూనుకోవాలి.

ఈనాడు మనము సరియైన విషయాన్ని గుర్తించుకోలేకుండా మన క్లాసంటే ఏమిటి మన subject అంటే ఏమిటి, మన చదువంటే ఏమిటి, మన discipline అంటే ఏమిటి, మన manners అంటే ఏమిటి అనే విషయాలను ఏమాత్రము విచారణ చేయకుండా చదువుకావాలి. చదువు కావాలి ఏదో ఒక విధంగా డిగ్రీ తీసుకోవాలి. 'O'grade రావాలి అంటున్నామేగాని ఏరీతిగా తెచ్చుకోగలం.

sri sathyasai vachanamrutam

**నేటి విద్యార్థులందున నూటికొకరు**
**పాఠ్య గ్రంథంబు చదువంగ పాటు పడరు**
**పాసు కావలె నంచును పరితపింత్రు**
**బూటకంబుగ మారెను నేటి విద్య.**

కేవలము కంఠస్థము చేసుకొని examination వ్రాసినంత మాత్రమున విద్యార్థులమౌతామా విద్యావంతులమౌతామా? ఈ విద్యవల్ల జగత్తునకు ఏమి ఉపకారం జరుగుతుంది? నీకు ఉపయోగం లేదు. జగత్తుకు ఉపయోగం లేదు. నీవు చదివిన విద్యలన్నీ ఒక సంవత్సరములోనే మరచిపోతున్నావు. చదివిన విద్యలకు చేసే ఉద్యోగమునకు ఏమాత్రం సంబంధము లేదు. జీవితమునకు ప్రధాన ఆధారమైన విద్యలు General Knowledge, common sense. ఈ విద్యలంతా మీ పాఠ్య గ్రంథములలో ఉండవు. నిత్య జీవితమునకు అవసరమైన సత్యమార్గమును బోధించే నిమిత్తమై ఈ విధమైన బోధలు మీకు సలుపవలసి వచ్చింది. మీ ఉద్యోగాల నిమిత్తమై ఈ చదువులు చదువుకోండి. అయితే నిత్యజీవితము కోసము ఈ చదువులు కూడను అత్యవసరమని గుర్తించండి.

## ప్రవర్తన సరిదిద్దుకోండి

విద్యార్థులారా! మీరు చక్కగా యోచన చేసుకోవచ్చు. మీరు లేబొరెటరీస్‌కి పోతున్నారు. అనేక పరిశోధనలు సలుపుతున్నారు. మీకిచ్చిన ఫిజిక్స్, కెమిస్ట్రో, బయాలజీ దేనిలోనే మనసు ఉంచి ఏ కెమికల్స్ కలిపితే ఏ రంగురావాలి ఏయే కెమికల్స్ ఏరీతిగా కలపాలి అనేదాన్ని మాత్రం గుర్తించుకోగలుగుతున్నారు. అయితే ఇవన్నీ రైట్, రాంగ్ ఎక్కడ నిర్ణయం చేసుకోగలుగుతున్నారు. ఒక లేబోరెటరీలో మాత్రం చేసుకోగలుగుతున్నారు. కానీ నిత్యజీవితములో మీరు నడిచే నడక ఏది రైట్ ఏది రాంగ్ అని మీరు ఏరీతిగా కనుక్కోగలుగుతున్నారు. మీరు తెలుసుకోటానికి ప్రయత్నించటం లేదు. ఈ జగత్తుకు సంబంధించిన విషయాలు మాత్రం నిత్యంగా గుర్తించారు. నీవు చదివే చదువుకు నిత్యజీవితములో గడిపే కాలమునకు చాలా వ్యత్యాసము ఉంటుండాది. నేను పూర్వమే చెప్పాను. ఐదు రకములైన knowledge ఉంటున్నాయని ఈ bookish knowledge today,

sri sathyasai vachanamrutam

tomorrow knowledge day, after tomorrow allergy. దీనిని మీరు ఆధారం చేసుకొని Superficial knowledge కింద దిగుతున్నారు. ఈ Superficial knowledge వలన general knowledge zero అవుతుండాది. general knowledge zero అయినప్పుడు ఈ discrimination knowledge ఏమాత్రం కూడను చేయటం లేదు. discrimination knowledge లోనే నీవు ప్రవేశించినప్పుడు ఇంక practical knowledge ఎట్లా వస్తుంది? జగత్తుకు ఈనాడు practical knowledge కావాలి. రెండు భాగములు హైడ్రోజను ఒక భాగము ఆక్సిజను రెండు కలుపుతే water అవుతుంది. ఇది లేబొరెటరీలో మాత్రమే తెలుసుకోగలుగుతున్నావు. అయితే నీవు భోజనానికి కూర్చున్నప్పుడు, హైడ్రోజను, ఆక్సిజను కలుపుకొని త్రాగుతున్నావా? ఇది practical science. నిత్య జీవితము లోపల జలము ఏరీతిగా పరిశుద్ధముగా ఉంటుండాలి. సరియైన రుచిగా ఉంటుండాలి. మాలిన్యము ఉండకూడదు. ఇలాంటివి నీవు చూసి త్రాగుతున్నావు. కనుకనే నిత్యజీవితములోపల మనయొక్క ప్రవర్తన లోపల ఏ దోషములు ఉండకూడదు. దీనిని సరియైన సమయములోనే రుచిగా అనుభవించాలి. జీవితము చాలా రుచికరమైనది.

ఒక చిన్న ఉదాహరణము. మీరు భోజనానికి కూర్చున్నారు. పప్పు కలుపుకున్నారు. ఈ పప్పులో కొంచెం ఉప్పు ఎక్కువైపోయింది. పప్పులో కొంచెము ఉప్పు ఎక్కువైపోతేనే రెండుగంటలలో అరిగిపోయే పప్పును కోపంతో తక్షణం ప్రక్కకు నెట్టేస్తున్నారు. పప్పులో ఉప్పు ఎక్కువగా ఉంటుండాదని చాలా విసుగు పడుతున్నారు. రెండు గంటలలో అరిగిపోయే పప్పులో కొంచెం ఉప్పు ఎక్కువైతే మీకు అయిష్టంగా ఉండినప్పుడు 80 సంవత్సరములు, 90 సంవత్సరములు, 100 సంవత్సరములు ఉండవలసిన జీవితములో కొంచెం రుచి ఉండనక్కరలేదా? దీనికి ఒక విధమైన విలువ ఉండనక్కరలేదా? మన క్రమశిక్షణను మనము సక్రమముగా పాటించకుండా పోయినప్పుడు జగత్తు మనలను ఎంత విమర్శిస్తుందనే సత్యాన్ని గుర్తించుకోవటం లేదా? ఇది కూడను మీరు నిత్యజీవితములో విచారణ చేసుకోవాలి.

నీవు సమానంతా pack చేసుకొని Bus standలో పోయి కూర్చున్నావు. ఐదు గంటలకు బస్సు వస్తుందనుకున్నావు. ఆరైంది, ఏడైంది, ఎనిమిదైంది, తొమ్మిదైంది. ఇంకా

srisathyasaivachanamrutam

బస్సు రాలేదు. నీవేమనుకుంటావు. బస్సు డ్రైవరును తిట్టుకుంటావు. ఆ డిపార్టుమెంటునంతా తిట్టుకుంటావు. గవర్నమెంటును తిట్టుకుంటావు. ఏమిటీ పాడు ప్రయాణాలు. ఏ విధమైన క్రమశిక్షణ లేకుండా ఉంటున్నాయి. సకాలమునకు బస్సులు రావటం లేదు సకాలానికి ట్రైనులు రావటం లేదు. సకాలానికి ప్లేనులు రావటం లేదు. అని అనేక రకములుగా దూషిస్తావు. ఒక జడమైన బస్సు జడమైన కారు సక్రమంగా సకాలమునకు రాకపోయిన నీ వింతగా దూషిస్తే నీవు చైతన్యవంతమైన మానవుడవైన నీక్రమాన్ని, నీ కట్టుబాటును, నీ క్రమశిక్షణను సక్రమంగా నీవు నడచుకోకుండా పోతే ఈ జగత్తు నిన్ను దూషించదా? నీ క్రమశిక్షణను నీవు సక్రమముగా పాటిస్తున్నావా? ఈ బస్సులను, ట్రైన్లను దూషించే అధికారము నీకెక్కడుంది. కనుక మొట్టమొదట మనము ఆ క్రమశిక్షణలో ఉత్తీర్ణులు కావాలి. మనము ప్రతి పనిలో ప్రవేశించాలి. సోమరితనంగా మనము నిద్రించకూడదు. మన హాస్టలుయందు కాని కాలేజి యందుగాని ఏఏ క్రమశిక్షణలైతే ఉన్నాయో ఆ క్రమశిక్షణలను మనము తు.చ నడచుకోవాలి. తెల్లవారు జామున 4-30 గంటలకు సుప్రభాతము లోపల ఓంకారము లోపల ప్రవేశించాలి. ఈ పనులే నీవు చేయలేకపోతే నీది కేవలము ప్రాణము లేని జీవితముగా రూపొందుతుంది.

విద్యార్థులారా! చక్కగా గుర్తించండి. ఒక మిషనే ఉంటుండాది. ఆ మిషను సక్రమంగా పనిచేయలేకపోతే, వాడకుండాపోతే తుప్పు పట్టేస్తుంది. ఒక జడమైన మిషను ఉపయోగించకుండా ఉండినప్పుడు తుప్పుపట్టినట్టుగా చైతన్యమైన ఈ మిషను సరియైన రీతిగా వినియోగం చేసుకోకపోతే దీనికెందుకు తుప్పు పట్టదు. అది rust. rust ఎట్లా వచ్చింది? ఉపయోగించకుండా పోవటంచేత డస్టంతా వచ్చి చేరిపోయింది. ఈ డస్టే, ఈ రస్టుగా మారిపోయింది. ఈ రస్టు వచ్చేటప్పటికి దాని శక్తంతా పోతుంది. అప్పుడు workshopకు రిపేర్ కోసం తీసుకుపోతున్నావు. సక్రమముగా ఆయిల్ చేసినప్పుడే బెస్టు అవుతుంది. ఎప్పుడు ఇది బెస్టవుతుంది. దీనిలో వుండిన డస్టు, రస్టు అంతా తీసివేసినప్పుడే ఇది బెస్టుగా ఉంటుండాది. కనుక మీరంతా best boys కావాలనుకున్నప్పుడు ఏంచెయ్యాలి? మీలో ఉండే రస్టు మీలో ప్రవేశించిన దుర్భావములనే, డస్టు, ఈ మనస్సు చంచలత్వము ఇవన్నీ పోవటానికి భగవంతునికి అర్పితము చెయ్యాలి. అక్కడే workshop అదే rest. అక్కడ నీవు restను చక్కగా అందుకున్నప్పుడు నీవు best boy అవుతావు. లేకపోతే worst boy అవుతావు. Best



srisathyasaivachanamrutam

కావాల్నా worst కావల్నా అని తనకు తాను విచారం చేసుకోవాలి. విద్యార్థులారా! సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ లోపల తయారైన పిల్లలు ప్రపంచములో ప్రవేశించి ఎన్ని రకములైన మార్గాలలో ఆదర్శవంతముగా రూపొందాలనే ఆశతానే ఈ ఇన్‌స్టిట్యూట్ స్టార్టు చేశాము. ఇది గురుకులాశ్రమముకాదు. ఋషికులాశ్రమము. ఋషి ఆశ్రమాలు పూర్వమంతా ఉండేవి కాని క్రమక్రమేణా ఆ ఆధునికత అభివృద్ధి అయ్యేకొద్ది ఆ ఋకారం పోయింది ఋ బదులు ఇషికులం ఇషికులం అంటుంటారు. ఆ ఇషికులం అనేది ఇప్పుడు ఇస్కూలు అయిపోయింది. కులం కూడా పోయింది. ఇసకలో ఉండిన కూలని ఇస్కూలు అంటున్నారు. మన జీవితమనేది కేవలము ఇసుకగా మారిపోతుండాది. ఈనాడు తిరిగి ఈ ఋషికులాన్ని మనం అభివృద్ధి చెయ్యాలి.

**మానవత్వము మరువకండి**

ఋతము అనగా మానసికమైన సత్యమని అర్థము. నిజము అనగా ప్రాపంచికమైన సత్యము. శారీరకమైన సత్యము. ఋతము మానసికమైన సత్యము. ఈనాడు మానసిక సత్యమును కోల్పోయినాము. దానిని తిరిగి మనము పునరుద్ధరించాలి. అదే ఈనాడు మనము చేయవలసిన పని. విద్యార్థులారా! మీ subjectను మీరు ఏమాత్రం చదవకూడదని నేను చెప్పను. దానియందు కూడను మీరు ఉత్తీర్ణులు కండి. దానియందు కూడను మీరు సక్రమమైన స్థితిని అందుకోండి. అయితే దానితో బాటు దీన్ని కూడను అత్యవసరంగా మీరు అభివృద్ధి గావించుకోవాలి. ఎంతకాలమైనా ఈ బల్బులు తుడిచిపెట్టుకోవటం, ఈ ఫాన్లు తుడిచిపెట్టుకోవటం ఈ విధముగా ఉంటుంటే కరెంటు లేకుండా పోతే ఇవన్నీ ఉండి ప్రయోజనము ఏమిటి? మీ subjectsఅన్నీ బల్బులు, ఫాన్లు, స్టౌలు ఇలాంటివే. దీంట్లో ఆధ్యాతికమనే కరెంటు ప్రవేశించినప్పుడు ఇవన్నీ ఉపయోగమవుతాయి. Knowledge without action in foolish. Action without knowledge is useless. కనుక ఈ రెండింటికి కూడను తగిన సంబంధ బాంధవ్యాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి. ఆధ్యాత్మిక భావాన్ని మీరు అభివృద్ధి పరచుకున్నప్పుడే లౌకికాలకు కూడను దీనివలన ఉపయోగ మేర్పడుతుంది. మీరు బయట ప్రపంచములో చూసినప్పుడు జీవితమనేది ఎంత అగౌరవమైనదిగా రూపొందుతుందో యోచించుకోవచ్చు. మానవత్వమే లేకుండా ఉంటుంటాది.

sri sathyasai vahini vachanamrutam

విద్యార్థులారా! మీరు మానవులుగా తయారుకావాలి. బయట ప్రపంచములో ప్రవేశించి అందులో చేరిన మాలిన్యమును పరిశుద్ధము చెయ్యాలి. అలాంటి ధైర్యసాహసములచేత ఈ సమావేశములో మీరు దూకాలి. దాని నిమిత్తమైమీరు ఇక్కడ తగిన తర్ఫీదులు పొందాలి. ఈనాడు ఇక్కడ తర్ఫీదు జరిగినప్పుడే అక్కడ మీరు పోయి పనిచేయగలరు. ఈ ట్రయినింగు లేకపోతే మీరు ముందు అక్కడకు పోయి ఏమి పని చేయగలరు? ప్రతిదానికి

**శ్రేయో హి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే**

**ధ్యానత్కర్మ ఫలత్యాగస్త్యా గాచ్ఛాంతి రనంతరం.**

ప్రతిదానికి ఒక విధమైన అభ్యాసము ఉంటుండాలి. ఒక దేవాలయములో ఒక పూజారి నిత్యము పూజ చేస్తూ ఉండేవాడు. పూజలు పూర్తయిన తరువాత హారతి ఇచ్చేవాడు. ఒక గంట పట్టుకొని ఒక చేత్తో బాగా తిప్పుతుండేవాడు. అది బాగా అలవాటైపోయిందతనికి. దీనిపాటికి దీన్ని తిప్పుతున్నాడు దీనిపాటికి దీన్ని కొడుతున్నాడు. అన్ని విధాల జరిగిపోతుండాది. కాల కర్మ కారణాలు కలిసి వచ్చాయి. కాయాన్ని వదలిపెట్టాడు. అనగా మరణించాడు. కొత్త పూజారిని పెట్టారు గ్రామస్థులు. వాడికి అలవాటు లేదు. గంట కొడితే హారతి నిలిచిపోతుంది. హారతియిస్తే గంట నిలచిపోతుంది. చూడండి. ఇంత చిన్న విషయానికి ఎంతో ట్రైనింగు కావాలి. ఇంత చిన్నదానికి ట్రైనింగు కావాలంటే ఇంక దివ్యమైన జీవితాన్ని ప్రకాశింప చేసుకోవాలంటే ఇంకెంత ట్రైనింగు కావాలి?

కనుక మన సంస్థయందు మాత్రమే మన Institute యందు మాత్రమే ఈ ట్రైనింగు చిక్కుతుంది. ఇంకొక చోట చిక్కదు. ఈ Instituteకు తగిన విలువను మనము సంపాయించాలి. దానికి తగిన అర్హతను మనం సంపాదించుకోవాలి. ఆ కీర్తిని ఒక్కటి మీరు నిలబెట్టుకొంటే అంతే చాలు ఇంకేమీ అక్కరలేదు. మీకెవ్వరూ చెప్పేవారు లేరు. ఇంటిలో చూస్తామా తల్లిదండ్రులు మిమ్మల్ని మరింత మోసములో ముంచుతున్నారు. ఇంక క్లాసులో చూస్తామా టీచర్సుకే తెలియదు. ఇంక మీకేమి చెప్పగలరు? ఏదో ఆయా subjects చెబుతున్నారేగాని ఈ discipline, ఈ devotion, ఈ duty, ఈ manners, ఈ behaviour వారెవరు చెప్పటం లేదు. పదినిముషములు లేటుగా క్లాసుకు వచ్చినాగాని ఆ కూర్చో కూర్చో అంటారు. ఎందుకోసం పదినిముషాలు లేటుగా వచ్చావు నీవు దే స్కాలరు



srisathyasaivachanamrutam

కాదు హాస్టలునందే ఉంటున్నావు. అందరూ ఒక్కతూరి రాకుండా నీవెందుకు లేటుగా వచ్చావు? ఏ బస్సు తప్పిపోయింది? ఏ ట్రైను తప్పిపోయింది? చెప్పటానికి కారణం లేదే? ఈ question అడిగే అధ్యాపకుడే లేడే? ఈ అధ్యాపకులు కూడను ఈ విధమైన శిక్షణ లోపల అదొక subject తీసుకోవాలి. లేకపోతే ఇన్ని కోట్లు ఇన్ని లక్షలు పెట్టి ప్రయోజనము యేమిటి? ఆధ్యాత్మిక విద్యలు ప్రధానంగా బోధించి తదుపరి ఈ లౌకికవిద్యలలో సమన్వయముగావించే నిమిత్తమే ఈ సంస్థను మేము స్థాపించాము. విద్యార్థులారా! మీరు చక్కగా గుర్తించి యోచించి ఈ పవిత్రతను చక్కగా మీరు ఆచరణలో పెట్టి జీవించటానికి ఇతరులకు ఆదర్శవంతముగా చూపటానికి తగిన కృషి చేయండి.

**(తేది. 21-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam